క్లుప్తంగా

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కొల్లాపూర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న కొల్లాపూర్ నుంచి శ్రీశైలం, సోమశిల క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమాశంకర్ వెల్లడించారు. సోమశిలకు ఉదయం 6:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ప్రతి అరగంటకు ఒక బస్సు చొప్పున.. శ్రీశైలానికి ప్రతి గంటకు ఒక బస్సు చొప్పున నడిపించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను భక్తులు వినియోగించుకోవాలని సూచించారు.

25 నుంచి బ్రహ్మోత్సవాలు

కోడేరు: మండల కేంద్రంలోని ఉమామహేశ్వరి ఆలయంలో బ్రహ్మోత్సవాలు 25 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు జంగం శివయ్య తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మోకాళ్లపై శ్రీశైలం వెళ్లిన వ్యక్తికి సన్మానం



తిమ్మాజిపేట: శ్రీశైలం వరకు మోకాళ్లపై వెళ్లి మల్లికార్జునుడి దర్శనం చేసుకొని వచ్చిన కూకుట్ల బాల్‌నాగయ్యను స్థానికులు, పలు పార్టీల నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. తిమ్మాజిపేట మండలంలో మారేపల్లి నుంచి శ్రీశైలం వరకు మోకాళ్లపై నడిచి వెళ్లి స్వామిని దర్శనం చేసుకున్నారు. తిరిగి స్వగ్రామానికి వచ్చిన బాల్‌నాగయ్యను కాంగ్రెస్, బీజేపీ నాయకులు, స్థానికులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన



అచ్చంపేట రూరల్: పట్టణంలోని శ్రీ కాకతీయ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు ఎన్నికలపై అవగాహనలో భాగంగా మాక్ పోలింగ్ నిర్వహించారు. నోటిఫికేషన్, నామినేషన్, ఉపసంహరణ, ప్రచారాలు, ఎన్నిక వంటి అంశాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా ఉపాధ్యాయులు వివరించారు. కౌంటింగ్, ప్రమాణ స్వీకారాన్ని నిజమైన ఎన్నికలలాగే నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామసభలు



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై 2023–24 సంవత్సరంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు కొనసాగుతున్నాయని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని గుంతకోడూరు, మేడిపూర్, సిర్సవాడ, ఇంద్రకల్, పర్వతాయిపల్లి, ఐతోల్, చర్లతిర్మలాపురం, పోల్మూర్ గ్రామాల్లో ఎస్ఆర్పీ, డీఆర్పీలు పనులు పరిశీలించి గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 27న మండల కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు

తాడూరు: జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాల మేరకు మండలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేసి మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను నడిపే వారిని గుర్తించామన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించకుండా నడిపే వారి వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పాఠశాలను సందర్శించిన పీఎంశ్రీ విద్యార్థులు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అంబటిపల్లి పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. బల్మూర్ మండలం అంబటిపల్లికి చెందిన పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావడం, జిల్లాలోని ఉన్నత ప్రమాణాలు కల్గిన పాఠశాలను సందర్శించాలనే ఉద్దేశ్యంతో సదరు పాఠశాల విద్యార్థులు ఎంఈఓ సత్యనారాయణశెట్టి అనుమతితో పాఠశాలను సందర్శించారు. రెండు బస్సుల్లో 180 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు పాఠశాల సందర్శనకు వచ్చారు. తిమ్మాజిపేట పాఠశాలలో 400మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

రోడ్ల అభివృద్ధికి మోక్షమెప్పుడో?

- ఏళ్ల తరబడి నిర్వాహణ శూన్యం
- మరమ్మతు లేక దెబ్బతిన్న బీటీ రోడ్లు
- ఇరువైపుల కంపచెట్లతో డొంకలను తలిపిస్తున్న దారులు
- ప్రజలకు ప్రయాణ కష్టాలు



పెద్దచెరువు కట్టపై కంపచెట్లు కమ్ముకొని అధ్వానంగా మారిన ఉప్పునుంతల-పులిజాల రోడ్డు

ఉప్పునుంతల: మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. గ్రామాలను కలుపుతూ అనుసంధానంగా మట్టి, బీటీ రోడ్ల నిర్వాహణపై పాలకులు, సంబంధిత అధికారులు పర్యావేక్షణ కొరవడింది. ఏళ్ల తరబడి అధ్వానంగా తయారైన రోడ్ల వెంట వెళ్లడానికి ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు రోడ్లపై వక్కెర్లు, గోతులు పడి వర్షం పడితే బురద గుంటలుగా మారుతున్నాయి. రోడ్లకు ఇరువైపుల కంపచెట్లు కమ్ముకొని బండ్ల డొంకలను తలపిస్తున్నాయి. చెరువుకట్టలపై ఉన్న రోడ్డుకు ఇరువైపుల కంప చెట్లు కమ్ముకొని ప్రమాద భరితంగా మారాయి. కొన్ని చోట్ల బీటీ లేసిపోయి కంకర తేలాయి. రోడ్లపై ఎదురెదురు వాహనాలు దాటలేని పరిస్థితిలో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

మట్టి రోడ్లు అధ్వానం..

మండలంలో గ్రామాలకు అనుసంధానంగా ఉన్న మట్టి రోడ్లు మరింతగా అధ్వానంగా తయారయ్యాయి. ఉప్పునుంతల మెయిన్ రోడ్డును, పల్కపల్లి వైపు వెళ్లే రోడ్డును కలుపుతూ బైపాస్ రోడ్డు మాదిరిగా ఉన్న బర్లడొంక రోడ్డు గోతులపడి పూర్తిగా దెబ్బతిన్నది. ఉప్పునుంతల- పెద్దాపూర్ వరకు, ఉప్పునుంతల – మొల్గర వరకు ఉన్న మట్టి రోడ్ల వెంట కంపచెట్లు కమ్ముకున్నాయి. మర్రిపల్లి – గట్టుతుమ్మెన్ స్టేజీ వరకు రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డుపై కంకర లేసి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దాసరల్లిపల్లి – పెద్దాపూర్ వరకు, సదగోడు –తిర్మలాపూర్ వరకు ఉన్న మట్టి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి, గుట్టమీది తండా వరకు ఉన్న మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. కొరటికల్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వెల్టూరు వరకు ఉన్న లింక్‌రోడ్డు పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంది.ఉప్పునుంతల మండల కేంద్రం నుంచి కొత్తరాంనగర్ వరకు మట్టి రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది.

కమ్మేసిన కంప చెట్లు..

ఉప్పునుంతల–తాడూరు వరకు బీటీ రోడ్డుకు ఇరువైపుల కంప చెట్లు కమ్ముకొని డొంక రోడ్డుగా మారింది. ఈరట్వానిపల్లి – పెనిమిళ్ల వరకు, పెనిమిళ్ల – సీబీ తండా వరకు ఉన్న బీటీ పనులు చేపట్టడంలేదు. మామిళ్లపల్లి – దాసర్లపల్లి మీదుగా రామగిరి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసమై వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మట్టి రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు బీటీ రోడ్ల వెంట ఉన్న కంపచెట్లను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి రోడ్డు దెబ్బతిని ఇబ్బందులు..



ఉప్పునుంతల నుంచి పల్కపల్లి వెళ్లే రోడ్డును కలుపుతూ అచ్చంపేట మెయిన్ రోడ్డు వరకు బైపాస్‌గా ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతిని పెద్ద గోతులుపడి చిన్నపాటి వర్షానికి మడుగులను తలపిస్తున్నాయి. ఇరువైపుల చెట్లు కమ్ముకొని డొంకగా మారింది. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధిని ఏమాత్ర పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా రోడ్డును బాగుచేయిస్తే అందరికీ ప్రయోజనంగా ఉంటుంది.

– తాండ్ర పుల్లయ్య, రైతు, ఉప్పునుంతల

దాతల సహకారంతో విద్యలో రాణించాలి



విద్యార్థినులతో మలబార్ గోల్డ్ సభ్యులు, పీసీసీ మెంబర్ బాలాజీ సింగ్

కల్వకుర్తి టౌన్: పేద విద్యార్థులకు దాతలు అందించే సహకారంతో విద్యలో రాణించి ముందుకెళ్లాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మలబార్ గోల్డ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను సంస్థ ప్రతినిధులు, లెక్చలర్లు అందజేశారు. కళాశాల ఫలితాలు ఉమ్మడి జిల్లాతోనే కాకుండా, రాష్ట్రస్థాయిలో అభినందించేలా ఉండటం గొప్ప విషయమని ఆయన అన్నారు. బాలికల విద్యాభివృద్ధికి ఇలాంటి స్కాలర్‌షిప్ పథకాలు ప్రతిఏటా అందిస్తామని, ప్రపంచ గమనాన్ని మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉంటుందని మలబార్ గోల్డ్ చైర్మన్ అహ్మద్ అన్నారు. మలబార్ ద్వారా కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 173 మంది విద్యార్థినులకు రూ.13.74 లక్షల స్కాలర్‌షిప్‌లను అందించామన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, నాంపల్లి కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, కళాశాల లెక్చలర్లు, నాయకులు, మలబార్ గోల్డ్ ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

టెలికాం సేవలు మెరుగుపర్చాలి



జీవీ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాముయాదవ్

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో టెలికాం సేవలు మెరుగుపర్చాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యులు రాముయాదవ్ బీఎస్ఎన్ఎల్ డీజీఎం జీవీ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డిలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో జీవీ రెడ్డిని ఆయన శనివారం కలిశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల, ఎల్లూరు, అమరగిరి, మొలచింతలపల్లి, సాతాపూర్‌తోపాటు పలు గ్రామాల్లో బీఎస్ఎల్ టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా గతంలో ఏర్పాటుచేసిన బీఎస్ఎన్ఎల్ టవర్ల సిగ్నల్స్ ఫ్రీక్వెన్సీని పెంచాలన్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లా కేంద్రాల నుంచి కొల్లాపూర్ వరకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో కొత్తగా బీఎస్ఎన్ఎల్ టవర్‌ను ఏర్పాటుచేయాలని కోరినట్లు రాముయాదవ్ వెల్లడించారు.

దీక్ష విరమించండి న్యాయం చేస్తాం



బాధితులతో మాట్లాడుతున్న డీటీ విద్యాధరి

చారకొండ: బైపాస్ బాధితులు ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ స్థలం గుర్తించి, వారికి స్థలాలు ఇచ్చి న్యాయం చేస్తామని, రిలే నిరాహార దీక్షలు విరమించాలని చారకొండ డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారి బైపాస్ బాధితులకు న్యాయం చేయాలని మండల కేంద్రంలో బైపాస్ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 12వ రోజుకు చేరాయి. సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చిల్వేరు శ్రీనివాసులు రిలే దీక్ష చేస్తున్న బాధితులకు మద్దతు తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ చొరవతో ఆర్‌డీఓ, తహసీల్దార్ ఆదేశాల మేరకు దీక్ష శిబిరాన్ని చారకొండ డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, ఆర్ఐ భరత్‌లు సందర్శించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం స్థలం గుర్తించి సర్వే చేసి, త్వరలో న్యాయం చెస్తామని హామీ ఇచ్చారు. త్వరల్లో బాధితులకు పట్టాలు అందిస్తామని, దీక్ష విరమించాలని కోరారు. ఇళ్ల స్థలాలు కేటాయించి, పట్టాల పంపిణీ పూర్తి అయ్యే వరకు దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బాధితులు అలివేలు, విజయ, అశోక్‌రెడ్డి, చిట్టెమ్మ, లావణ్య, గుండెబాలనారి వెంకటమ్మ, సుమతమ్మ, కవిత, రాజు, తదితరులు ఉన్నారు.

శ్రీశైలానికి బయలుదేరిన శివమాలధారులు



వెల్దండ మండలం కుప్పగండ్ల నుంచి పాదయాత్రగా వెళ్తున్న శివమాలధారులు



అచ్చంపేటలో శివమాలధారులకు పండ్లు పంపిణీ చేస్తున్న ముస్లింలు

సాక్షి, నెట్‌వర్క్: వెల్దండ మండలంలోని కుప్పగండ్ల, పెద్దాపూర్ గ్రామాలకు చెందిన శివమాలధారులు ఇరుముడులతో శ్రీశైలం బయలుదేరారు. కుప్పగండ్ల గ్రామానికి చెందిన 33మంది మాలధారులు పాదయాత్రగా వెళ్లారు. కార్యక్రమంలో గురుస్వాములు, శివమాలధారులు, గ్రామపెద్దలు ఉన్నారు.

శివ మాలధారులకు పండ్ల పంపిణీ

- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీశైలం కాలినడకన వెళ్తున్న శివ మాలధారులకు మంచినీటి బాటిళ్లు, పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.
- అచ్చంపేటలో శ్రీశైలం కాలినడక వెళ్తున్న శివ మాలధారులకు అచ్చంపేట ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండ్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు.
- తెలకపల్లి మండల కేంద్రంలో బోగరాజు నరసింహ, భాస్కర్ శ్రీశైలం పాదయాత్రకు వెళ్తున్న శివ మాలధారులకు పండ్లు, కొబ్బరి నీళ్ల అందజేశారు.

శివ మాలధారుల ఇరుముడి

- తిమ్మాజిపేట మండలంలోని పుల్లగిరి గ్రామ పంచాయతీలో బండమీదితండాలో శివ మాలధారులు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు.

మహాపడిపూజ

- తాడూరు మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఉపాధ్యాయుడిపై విచారణ చేయాలి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో అక్రమంగా విధుల నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ భరత్, బంజారా గిరిజన సంఘం అధ్యక్షుడు సంతోష్ నాయక్ శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ కార్యాలయంలో మాట్లాడుతూ గతంలో తిమ్మాజిపేట మండలంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసి రెండేళ్ల క్రితం బయోమెట్రిక్ అటెండెన్స్‌ను స్కూల్ బయట వేసినట్లు పేర్కొన్నారు. అనాటి కలెక్టర్ ఆదేశాలతో ఈ మధ్య కాలంలో బదిలి అయిన జిల్లా విద్యాశాఖాధికారి విచారణ చేసి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఆ ఉపాధ్యాయుడు ప్రస్తుతం పెద్దకొత్తపల్లి మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ ఉపాధ్యాయుడు రెండేళ్లుగా పాఠశాలకు హాజరుకాకుండా జీతం తీసుకోవడం జరిగిందని, ఆ విషయంపై రిజినల్ జాయింట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అతనిపై విచారణ జరపాలని ప్రస్తుత జిల్లా విద్యాశాఖాధికారికి ఆర్‌జేడీ విజయలక్ష్మి ఆదేశించినట్లు పేర్కొన్నారు. జీతం రికవరీ చేయకుండా విద్యాశాఖాధికారులు తప్పుడు ప్రొసిడింగ్‌లు ఇస్తూ ఆ ఉపాధ్యాయుడికి సహకరిస్తున్న విద్యాశాఖాధికారులు, డీఈఓ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని గ్రాడ్యుయోషన్ అసోసియేషన్ నాయకుడు భరత్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్‌నాయక్ డిమాండ్ చే శారు. కార్యక్రమంలో విజయ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణానికి రూ.లక్ష విరాళం

కల్వకుర్తి: పట్టణంలోని భీమలింగేశ్వర స్వామి దేవాలయంలో 26న శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆలయ కమిటీ సభ్యులకు కల్యాణానికి రూ. లక్ష 16వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గణేష్, నిర్వాహకులు కరెంటు రాజు, మాసుల రాజు, రమేష్ యాదవ్ ఉన్నారు.

మొక్కజొన్నలో ఎండు తెగులు నివారించాలి



మొక్కజొన్న పంటను పరిశీలించిన ఏఓ నీతి

బిజినేపల్లి: మొక్కజొన్న పంట సాగు చేసే రైతులు ఆ పంట పూత అనంతరం కంకి ఏర్పడే దశలో ఎక్కువగా నీటిని పారించడం వల్ల ఎండు తెగులు సోకుతుందని, దీనిని నివారించడానికి రైతులు అధికారుల సూచనలు సలహాలు పాటించాలని ఏఓ నీతి అన్నారు. గురువారం బిజినేపల్లి మండలంలోని వివిధ వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండు తెగులు నివారణ కోసం మొక్కలను తొలి దశలోనే ఏరి కాల్చాలని, అంతేకాక మొక్కల మొదళ్ల వద్ద కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా, లీటరు నీటికి లేదా ఎకరాకు 600 గ్రా చొప్పున తడుపుకోవాలని సూచించారు.

ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కల్వకుర్తి టౌన్: గురుకులాల్లో 5వ తరగతి రెగ్యులర్ ప్రవేశాలకు నిర్వహించే టీజీసెట్ ప్రవేశ పరీక్షకు పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ రాజశ్రీ శనివారం తెలిపారు. సెంటర్‌లో ఆదివారం నిర్వహించే పరీక్షకు 514 మంది విద్యార్థులు హాజరవుతారని ఆమె తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీలకు ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు.

నేడు స్వామివారి ఎదుర్కోళ్లు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీ లో వెలసిన లక్ష్మీపద్మావతి సహిత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రా రంభం కానున్నాయి. వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నా రు. 23న సాయంత్రం స్వామివారి ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. 25న గరుడ సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి. వివిధ సంఘాల సహకారంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ కల్వ మనోహర్ వెల్లడించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



కొల్లాపూర్: కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బౌరు విజయలక్ష్మి, సురేందర్‌సింగ్ దంపతులు శనివారం పట్టణంలోని విశ్వశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వారి మనుమళ్లు శౌర్యవీర్‌సింగ్, రిషిరాజ్‌సింగ్ పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమం చేపట్టారు. ఆశ్రమంలో చిన్నారుల కేక్ కట్‌చేసి వృద్ధులకు పంచారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు చిట్టిబాబు, శివశంకర్ తదితరులు ఉన్నారు.

మార్కెట్‌ను పరిశీలించిన కమిషనర్

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని కూరగాయల, మటన్ మార్కెట్లను మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ శనివారం పరిశీలించారు.మటన్ మార్కెట్‌లో మాంసాన్ని విక్రయించే వ్యాపారులు వారి మాంసాన్ని స్లాటర్ హౌస్‌లోనే, పశువైద్యాధికారి సమక్షంలో చేయాలన్నారు. కూరగాయల మార్కెట్‌లో వరుస క్రమంలో రోడ్లపైకి రాకుండా వ్యాపారాలను చేసుకోవాలని సూచించారు.

కళాశాలలో వార్షికోత్సవం



కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ఆర్ఐడీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడారు. విద్యార్థినులు చదువుల్లో రాణించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు దశరథరాము, కురుమూర్తి, వినయ్‌కుమార్, రాగమయి, మయూరి, స్వర్ణలత, కృప, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బాలసభలతో మేదస్సుకు పదును

తాడూరు: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో చైతన్యం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి నాలుగో శనివారం బాలసభలు నిర్వహించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం రామ్మోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్ రెడ్డి, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతల మధ్య ప్రహరీ కూల్చివేత



అంబట్‌పల్లిలో బందోబస్తు మధ్య ప్రహరీ కూల్చుతున్న అధికారులు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో 5 రోజులుగా కొనసాగుతున్న ఉద్రిక్తకర వాతావరణానికి తెరపడింది. శనివారం తెల్లవారుజామున పోలీసుల బందోబస్తు మధ్య అధికారులు అక్రమంగా నిర్మించిన ప్రహరీని కూల్చేశారు. సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి ఇంటి ముందు భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో రెండేళ్ల క్రితం ప్రహరీ నిర్మించారు. అధికార పార్టీకి చెందిన వారు కలెక్టర్ ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 18న సర్వేయర్లు సర్వే నిర్వహించగా, 732లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొంత మేరకు ఆక్రమించుకొని గోడ నిర్మాణం చేశారని తెలిపారు. దీంతో గోడ నిర్మించిన వ్యక్తికి ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఈ నెల 20న కూల్చివేయుటకు యంత్రాలతో సిద్ధం కాగా, గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కూల్చివేత ప్రయత్నాలు విరమించుకొని వెళ్లి పోయారు. శనివారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో అధికారులు పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతను చేపట్టారు. అప్పటికే అక్కడి చేరుకున్న గ్రామస్తులు కొందరు కూల్చివేతను అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వారించారు. 732 సర్వే నెంబర్‌లో మొత్తం 5.29 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇళ్ల నిర్మాణాలు, డబ్బాల ఏర్పాటు తదితర కట్టడాలున్నాయి. వాటి విషయంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై పలువురు చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాండునాయక్, ఎస్ఐ నాగరాజు, ఆర్ఐ సీతారాంనాయక్ పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



చారకొండలో సేవాలాల్ జయంతి పాల్గొన్న నాయకులు

చారకొండ: గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, రాష్ట్ర విద్యాకమిటీ సభ్యులు చారకొండ వెంకటేష్ అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే సతీమణి గువ్వల అమల, అర్జున్‌రెడ్డి, గిరిజన సంఘం నాయకులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు మందు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాల్‌రాం గౌడ్, జేసీబీ వెంకటయ్య గౌడ్, గిరిజన సంఘం నాయకులు ప్రశాంత్, శ్రీను, నూర్‌పాల్ నాయక్, సాయి కుమార్, తిరుమలేష్, గోపి, రవి, శంకర్ ఉన్నారు.

కరపత్రాల విడుదల

కల్వకుర్తి రూరల్: గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంతు సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని గిరిజన సంఘం నాయకులు చెప్పారు. కల్వకుర్తిలో సేవాలాల్ జయంతి కరపత్రాలను విడుదల చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శివరాం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని శివరాం కోరారు. కార్యక్రమంలో హనుమాన్ నాయక్, నిరంజన్ నాయక్ పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన వివాహిత జెల్ల పల్లవిని మానసికంగా వేధింపులకు గురిచేస్తున్న అత్తింటి వారిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. కుప్పగండ్లకు చెందిన పల్లవిని రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం జూలపల్లికి చెందిన ఉదయ్‌కిరణ్‌కు ఇచ్చి 11ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. కొన్ని నెలలుగా తరచుగా భర్త ఉదయ్‌కిరణ్‌తో పాటు అత్తమామలు, ఆడపడుచులు ఆమెను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్ది చెప్పినప్పటికీ వారి తీరు మారలేదు. బాధితురాలు పల్లవి ఫిర్యాదు మేరకు భర్త ఉదయ్ కుమార్‌తో పాటు అత్తమామలు, నలుగురు ఆడపడుచులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

తిమ్మాజిపేట : మండలంలోని ఆవంచ గ్రామానికి చెందిన లక్ష్మీప్రసన్న అనే వివాహిత అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన నాగేశ్వర్ కుమార్తె లక్ష్మీప్రసన్న కొంతకాలంగా పోలేపల్లి సెజ్‌లో హెటిరో కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఈనెల 17వ తేదీ ఉదయం 8.30గంటలకు కంపెనీలో డ్యూటీకి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. రాత్రైనా కూతురు ఇంటికి రాలేదు. దీంతో ఆమె పనిచేసే కంపెనీలో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అదే కంపెనీలో పనిచేసే ఓ వ్యక్తిపై అనుమానం ఉందని, అతనిపై చర్యలు తీసుకోవాలని నాగేశ్వర్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వెనచెర్ల విద్యార్థులు

పెద్దకొత్తపల్లి: వెనచెర్ల పాఠశాలకు చెందిన బాస్రిన్, శైలజ, హరీష్ 34వ సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాములు తెలిపారు. విద్యార్థులను మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి కస్తూర్బాలో శనివారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి పొదుపు–ఆవశ్యకతపై ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీటీ ప్రతినిధి సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఓ కుసుమకుమారి, సంస్థ ప్రతినిధులు ఆంజనేయులు, రవీందర్ పాల్గొన్నారు.

చికెన్ మేళా

కల్వకుర్తి టౌన్: బర్డ్ ఫ్లూ వేగంగా వ్యాపిస్తున్న వేళ ఫౌల్ట్రీ ఫారంల సభ్యులు చికెన్ వాడకంపై అపోహలు తొలగించేందుకు చికెన్ మేళా శనివారం నిర్వహించారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ రోడ్డులో నిర్వహించిన మేళాకు ప్రజలు చాలానే హాజరయ్యారు. పెళ్లిళ్ల సీజన్ కావటంతో చికెన్ అమ్మకాలు తగ్గటంతో మేళాను నిర్వహించినట్లుగా వారు తెలిపారు. కార్యక్రమంలో ఫౌల్ట్రీ ఫారంల సభ్యులు శ్రీధర్ రావు, పలువురు పాల్గొన్నారు.

